సాక్షి
ములుగు
బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



బీసీల హక్కుల సాధనకు..
హక్కుల సాధన కోసం బీసీలందరూ ఐక్యంగా ఉద్యమించాలని భారత జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు.
- 8లో▸



ఎదురుచూపులు ఫలించేనా?
పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న ఎన్పీడీసీఎల్ అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ (ఏడీఈ)లలో ఆశలు చిగురిస్తున్నాయి.
- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
35.0^0 / 22.0^0

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ పెరుగుతుంది. రాత్రి చల్ల గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జాతర కమిటీ ఏర్పాటుకు కసరత్తు

ఎస్‌ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మ జాతర ట్రస్టు బోర్డు కమిటీ ఏర్పాటుకు కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. నూతనంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన రెండు నెలలకే మహాజాతర రావడంతో జాతరకు మూడు నెలల ముందుగానే ట్రస్టు బోర్డు కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉండగా జాతర సమయం దగ్గర పడటంతో ఈ సారి ఉత్సవ కమిటీనే నియమించనున్నారని తెలుస్తుంది. ఈ మేరకు ఇప్పటికే డైరెక్టర్ల పేర్లు మంత్రి సీతక్కకు చేరినట్లు వినికిడి. మంత్రి సీతక్క ద్వారా ఒక కమిటీ లిస్ట్ ఫైనల్ చేసి దేవాదాయ శాఖకు పంపించిన మరుక్షణమే జాతర కమిటీని ప్రకటించనున్నట్లు తెలుస్తుంది. జాతరకు సమయం దగ్గర పడుతుండడంతో ఇంకా మూడు నాలుగు రోజుల్లో జాతర కమిటీ పై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. తాడ్వాయి మండలం కొండపర్తికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఆరెం లచ్చుపటేల్‌ని కమిటీకి చైర్మన్‌గా నియమించే అవకాశం ఉన్నట్లు నాయకుల మధ్య చర్చ జరుగుతోంది.

పోస్టు కార్డు ఉద్యమం



వెంకటాపురం(కె): ధరణి పోర్టల్ వ్యవస్థను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమం చేపటినట్లు గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. మండల కేంద్రంలో పోస్టుకార్డు ఉద్యమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి పోర్టల్ వ్యవస్థను రద్దు చేయాలని కోరుతూ ప్రజా భవన్‌కు వెయ్యి ఉత్తరాలతో వినతులను అందజేయనున్నట్లు తెలిపారు. ఏజెన్సీలో గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనితి వెంకటకృష్ణ, ఊనెం ప్రతాప్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల రక్షణకు ఉద్యమించాలి

వెంకటాపురం(కె): కార్మిక చట్టాల రక్షణకు సంఘటితంగా ఉద్యమించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు మీనకుమారి అన్నారు. ఈ నెల 16న కార్మిక చట్టాల రక్షణకు చేపట్టనున్న దేశవ్యాప్త బంద్ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు పాల్గొంటారని ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు హక్కుగా ఉన్న చట్టాలను రద్దు చేస్తూ కార్మికులకు ప్రశ్నించే హక్కు లేకుండా చేస్తుందన్నారు. దేశ వ్యాప్త బంద్‌లో అన్ని వర్గాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



ఏటూరునాగారం: జాతీయ స్థాయి కరాటేలో విద్యార్థుల ప్రతిభ కనబర్చినట్లు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబశివ రావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, పీఈటీని మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన ఖమ్మంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారని తెలిపారు. అండర్ 17 బాలికల– 50కేజీల విభాగంలో చామర్తి ఐశ్వర్య బంగారు పతకంతో పాటు గ్రాండ్ ఛాంపియన్‌గా నిలిచిందన్నారు. అండర్ 17 బాయ్స్– 45కేజీల విభాగంలో ఎండీ తౌఫిక్ బంగారు పతకం, అండర్ 14 బాయ్స్ –35 కేజీల విభాగంలో వసంత విశాల్ సిల్వర్ మెడల్ సాధించారన్నారు. కోచ్ అబ్బు మాస్టర్ ప్రత్యేక కృషితోనే ఈ పతకాలను సాధించినట్లు హెచ్‌ఎం వెల్లడించారు.


మానుకోట పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకోవాలి

ములుగు రూరల్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మానుకోట పార్లమెంట్ సీటును బీజేపీ కైవసం చేసుకోవాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు అన్నారు. జిల్లా అధ్యక్షుడు బలరాం అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. దేశంలో మోదీ పదేళ్ల పాలనలో ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చారన్నారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న గిరిజన యూనివర్సిటీకి కేంద్ర ప్రభుత్వం రూ. 900 కోట్లు కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, కృష్ణ, భూక్యా రాజునాయక్, జవహర్ లాల్, రవీందర్, మహేందర్ పాల్గొన్నారు.

మేడారంలోని సమ్మక్క గుడి



కన్నెపల్లిలోని సారలమ్మ గుడి





‘గుడిమెలిగె’కు సిద్ధం

నేటి నుంచే మహాజాతర పూజా కార్యక్రమాలు
- మేడారంలో సమ్మక్క, కన్నెపల్లిలో సారలమ్మ ఆలయాలు శుద్ధి
- ప్రత్యేక పూజలు నిర్వహించనున్న పూజారులు

ఎస్‌ఎస్ తాడ్వాయి: తెలంగాణ కుంభమేళా, మేడారం మహాజాతర ఉత్సవాల్లో తొలి కార్యక్రమమైన గుడిమెలిగె పండుగ నేడు(బుధవారం) జరగనుంది. ఇందులో భాగంగా పూజారులు మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలో ఉన్న సారలమ్మ ఆలయాలు, పూజా సామగ్రిని శుద్ధి చేసి అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ పండుగతో మేడారం సమ్మక్క– సారలమ్మ మహాజాతర తొలిపూజ ప్రారంభం కానుంది. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరిగే మహాజాతరకు కోటి మందికి పైగా భక్తులు హాజరవుతారని అధికారులు అంచనాలు వేస్తున్నారు. ఇంతటి ప్రసిద్ధి పొందిన ఈ జాతర ప్రారంభానికి నాంది గుడిమెలిగె పండుగ. ఒక్కప్పుడు మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారమ్మలకు గుళ్లుగా గుడిసెలు ఉండేవి. జాతర ముందు ఈ గుడిసెలకు మరమ్మతులు చేసేవారు. గుడిసెలకు కొత్తగా పైకప్పు అమర్చడం (కప్పడం) చేసేవారు. దీన్నే గుడి మెలగడం అంటారు. ఈ ప్రక్రియతోనే జాతర తొలిపూజ కార్యక్రమాలు మొదలయ్యేవి. ఇప్పుడు గుడిసెలు లేవు. వీటి స్థానంలో భవనాలు కట్టారు. గుడిసెలు లేకున్నా.. జాతరకు రెండు వారాల ముందు గుడి మెలిగె కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

14న మండమెలిగె..

జాతరకు సరిగ్గా వారం రోజుల ముందు 14వ తేదీన దేవతలు ఉండే ఆవరణలను శుద్ధి చేసి ముగ్గులు వేసి అలంకరిస్తారు. దీన్ని మండమెలిగె పండుగ అంటారు. గుడి, మండమెలిగె కార్యక్రమాలు తల్లుల వారంగా భావించే బుధవారాల్లోనే జరుగుతాయి. ఇదే రోజున సమ్మక్క వారంగా భావించి భక్తులు తమ ఇళ్లను శుద్ధి చేసుకుంటారు. గుడి మెలిగె పూజ కార్యక్రమం ముగిసేంత వరకు పూజారులు ఉపవాసం ఉంటారు.

కన్నెపల్లిలో..

మేడారానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని కన్నెపల్లిలో ఉన్న సారలమ్మ ఆలయంలో సారలమ్మ పూజారులు ఉదయాన్నే స్నానమాచరించి ఆలయానికి చేరుకుంటారు. ఆలయం లోపల, బయట ఉన్న బూజు దులిపి, నీటితో కడిగి శుభ్రం చేస్తారు. అనంతరం కాక వంశం ఆడ పడుచులు గుడి లోపల, బయట అలుకుపూతలు వేసి పసుపు, కుంకుమలతో ముగ్గులు వేసి అలంకరిస్తారు. మామిడి తోరణాలు కడతారు. సారలమ్మ వస్త్రాలు, పూజా సామగ్రిని శుద్ధి చేస్తారు. సారలమ్మ వడేరా(కుండలు)లను పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. ధూపదీపాలు వెలిగించి సారలమ్మకు పూజలు చేస్తారు. ఈ గుడిమెలిగె పండుగతో జాతర ఉత్సవాలు ప్రారంభమైనట్లుగా చెప్పవచ్చు.

మేడారంలో సమ్మక్క పూజారులు, వడ్డెలు..

మేడారంలోని పూజారులు, వడ్డెలు ఉదయాన్నే తలంటు స్నానం చేసి సమ్మక్క ఆలయానికి చేరుకుంటారు. తొలుత బూజు దులిపి, అనంతరం నీటితో ఆలయం లోపల, బయట శుభ్రం చేస్తారు. అనంతరం పూజారుల సంబంధీకులైన ఆడపడుచులు ఆలయంలో అలుకుపూతలు నిర్వహించి పసుపు, కుంకుమలతో ముగ్గులు వేస్తారు. ఆలయంలో భద్రపరిచిన అమ్మవారి పూజా సామగ్రి, వస్తువులు, వస్త్రాలను బయటకు తీసి నీటితో శుద్ధి చేస్తారు. అనంతరం ధూపదీపాలతో తల్లికి పూజలు నిర్వహిస్తారు.

బస్టాండ్‌లో పనులు పూర్తి చేయాలి



పెయింటింగ్ పనులను పరిశీలిస్తున్న పీఓ అంకిత్

ఏటూరునాగారం: మేడారంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మేడారం జాతరలో భక్తులకు కావాల్సి న సౌకర్యాల కల్పనపై మంగళవారం ఐటీడీఏ పీఓ అంకిత్ పరిశీలించారు. మహా జాతరకు వస్తున్న భక్తులు పుణ్యస్నానాలు ఆచరించటానికి బస్టాండ్ పరిసరాల్లో బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ఓపెన్ చేసినట్లు తెలిపారు. బస్టాండ్ పరిసరాల్లో చెత్తను శుభ్రం చేస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని వెల్లడించారు. అప్రమత్తంగా లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గిరిజన మ్యూజియంలో జరుగుతున్న పెయింటింగ్ పనులను పరిశీలించి గిరిజన సంప్రదాయ, సంస్కృతి ఉట్టిపడేలా పెయింటింగ్ పనులు ఉండాలన్నారు. ఎక్కడ కూడా పనులు పెండింగ్‌లో ఉండవద్దని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏపీఓ వసంతరావు, ఎస్‌ఓ రాజ్‌కుమార్, డీఈఈ సతీష్ ఉన్నారు.

జాతరలో వైద్య సేవలకు సహకరించాలి



వైద్య శిబిరంలో మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఎస్‌ఎస్ తాడ్వాయి: మేడారం జాతరలో భక్తులకు వైద్య ఆరోగ్యశాఖ తరుపున అందించే సేవలకు స్థానిక రైతులు సహకరించాలని డీఎంహెచ్‌ఓ అప్పయ్య అన్నారు. మేడారంలోని కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఇప్పటి వరకు 3,250 మంది భక్తులకు వైద్య సేవలందించామని తెలిపారు. వైద్యం కోసం వచ్చే భక్తులు చాలా వరకు జలుబు, దగ్గు, ముక్కు కారడం, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో పాటు గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవారే ఎక్కువ గా ఉన్నారని తెలిపారు. కాగా ఒక్కటే ఒక తేలు కుట్టిన కేసు నమోదైనట్లు తెలిపారు. కల్యాణ మండపంలో జాతర నాలుగు రోజుల పాటు ఏర్పాటు చేయనున్న వైద్య శిబిరానికి ఏర్పాట్ల కోసం చేస్తున్న మరమ్మతు పనులను పరిశీలించి, 10వ తేదీలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మేడారం జాతర సందర్భంగా వైద్య శిబిరాలకు కేటాయించిన స్థలాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను స్థానిక రైతులు, భూ యజమానులు తొలగించారని తెలిపారు. వైద్య శిబిరాలకు కేటాయించిన స్థలాల్లో ఫ్లెక్సీలను తొలగించరాదని, వైద్య శిబిరాల ఏర్పాటుకు సహకరిస్తే భక్తులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డ్యూటీ డాక్టర్లు సుచరిత, మౌనిక, డీపీఎంఓ సంజీవరావు, ఫార్మసిస్ట్ కిరణ్, ఏఎన్‌ఎంలు ఝాన్సీ రాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి

అదనపు కలెక్టర్ శ్రీజ



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీజ

ములుగు/ములుగు రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. తెలంగాణ రాష్ట్రం తరపున మొదటి స్థానంలో నిలిచి 35వ సౌత్ ఇండియా సైన్స్ ఫేయిర్–2024కు ఎంపికైన రామన్నగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గార మైథిలి, గార రక్షిత, బొల్లె మనీష్‌ను అదనపు కలెక్టర్ శ్రీజ మంగళవారం తన ఛాంబర్‌లో అభినందించారు. గత నెల 22, 23, 24వ తేదీల్లో ఆన్‌లైన్‌లో రాష్ట్రస్థాయి పోటీలలో 9వ తరగతి విద్యార్థులు మైథిలి, రక్షిత ఇరువురు ఏఐ బేస్డ్ ఇంటిలిజెంట్ అల్కహాల్ డిటెక్షన్ అలారం సిస్టం ఫర్ డ్రైవర్స్ ప్రాజెక్టు, మనీష్ ప్రదర్శించిన వాయిస్ యాక్టివేటెడ్ హై అండ్–లో హార్ట్ బీట్ అండ్ పల్స్ ట్రాకింగ్ సిస్టం ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి నుంచి ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు అండగా నిలిచిన గైడ్ టీచర్ గూడూరు శ్యాంసుందర్‌రెడ్డి, హెచ్‌ఎం కొయ్యడ మల్లయ్యలను అదనపు కలెక్టర్ శాలువాతో సన్మానించారు. విద్యార్థులు తమకు ఎంతటి కష్టం ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొంటూ లక్ష్యం వైపు ముందుకు సాగాలన్నారు. అనుకున్నది సాధించేంత వరకు విశ్రమించకూడదని సూచించారు. భవిష్యత్‌లో మరిన్ని ఆవిష్కరణలు చేసి ములుగుకు మంచి పేరు తీసుకరావాలని సూచించారు. విద్యాశాఖ తరపున డీసీఈబీ కార్యదర్శి విజయమ్మ, జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్‌లు విద్యార్థులను అభినందించారు.

పోక్సో కేసుల్లో పోలీసుల పురోగతి



భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన ఎస్పీ శబరీష్

ములుగు: పోక్సో, రేప్ కేసుల్లో జిల్లా పోలీసులు పురోగతి సాధించే దిశగా అడుగులు వేస్తున్నారని ఎస్పీ డాక్టర్ శబరీష్ అన్నారు. జిల్లా కేంద్రంలో బండారుపల్లి రోడ్డులో భరోసా కేంద్రాన్ని ఎస్పీ మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. లైంగిక వేధింపులకు గురైన మహిళలకు, చిన్నారులకు మద్దతు అందించి మానసిక కౌన్సెలింగ్, మెడికల్, లీగల్ ప్రాసిక్యూషన్ సేవలను అందించడానికి భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. బాధిత మహిళలు పోలీస్ స్టేషన్, ఆస్పత్రుల చుట్టూ తిరగకుండా ఒకేచోట అన్ని రకాల సేవలు అందుతాయని తెలిపారు. హింస, లైంగిక వేధింపులను తగ్గించడం చిన్నారులకు అండగా ఉండడమే ముఖ్య లక్ష్యం అన్నారు. అత్యాచారం, పోక్సో చట్టం బాధితులు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన తర్వాత సదరు బాధితులను ఆస్పత్రులకు పంపి వైద్య పరీక్షలు చేపట్టడం తప్పని సరి, ఐపీసీ 161, 164 ప్రకారం మహిళా ఎస్సై సమక్షంలో ఈ విషయాలు రికార్డు చేయబడుతాయని తెలిపారు. భరోసా కేంద్రానికి డీసీఆర్బీ డీఎస్పీ సుభాష్‌బాబు నోడల్ అధికారిగా ఉంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, సీడబ్ల్యూసీ చైర్మన్ వసుధ, సీడబ్ల్యూఓ ప్రేమలత, డీసీపీఓ ఓంకార్, సీఐ రంజిత్‌కుమార్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



రమేష్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న కోచ్, తదితరులు

ఏటూరునాగారం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ఇండియా అథ్లెటిక్ కోచ్ నాగపురి రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ క్రీడా మైదానంలో స్పోర్ట్స్ క్లబ్ ద్వారా అథ్లెటిక్స్ ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులతో కలిసి ఆయన మంగళవారం క్రీడలను ఆడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో క్రీడలు, చదువులో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. మనం ఇప్పుడు పడే శ్రమ మన భవిష్యత్‌కు పునాది అన్నారు. క్రీడల వల్ల భవిష్యత్తులో గొప్ప స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. మంచి టాలెంట్ ఉన్న క్రీడాకారులు గ్రామాల్లో ఉన్నారని ప్రతిభను వెలికితీస్తేనే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు. భవిష్యత్తులో భారతదేశం తరపున ఆడే అవకాశాలు కూడా వస్తాయని వివరించారు. అనంతరం క్రీడా ప్రాంగణంలో కోచ్ పర్వతాల కుమారస్వామి రమేష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోచ్ నాగరాజు , వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న నాగయ్య

వాజేడు: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలను వేసుకున్న పేదలకు పట్టాలను తక్షణమే ఇవ్వాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మండపాక సమీపంలో గుడిసెలు వేసిన ప్రభుత్వ స్థలంలో మంగళవారం రెండు రోజుల రాజకీయ శిక్షణ తరగతులను సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదటి రోజు శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన నాగయ్య మాట్లాడారు. పేదలందరూ ఇంటి స్థలాలను సాధించుకునే వరకు నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి దేవుళ్లు, మతాల పేరుతో దేశ సంపదను బడా పెట్టుబడిదారులకు ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. దేశంలో విద్యా, వైద్యం పేదలకు అందివ్వకుండా ప్రజలను రాముడి గుడి అంటూ మోసం చేస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ శిక్షణ తరగతుల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, జిల్లా కమిటీ సభ్యుడు గ్యానం వాసు, మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి, దామోదర్, దేవయ్య, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తి చేయాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేశవులు

గోవిందరావుపేట: నాణ్యమైన అధిక దిగుబడులను ఇచ్చే సన్న రకాల విత్తనాలను రైతులు ఉత్పత్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కేశవులు అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో విత్తనోత్పత్తిపై రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతాంగానికి ఆధునిక పద్ధతిలో మేలైన అధిక దిగుబడులు ఇచ్చే విత్తనాలను అందించాలని సంస్థ కృతనిశ్చయంతో ముందుకు సాగుతుందన్నారు. ప్రజలకు వినియోగంలో ఉన్న సన్న రకాల్లో మేలైన వాటిని రైతులు ఉత్పత్తి చేసి సంస్థకు అందించాలన్నారు. మేలైన సన్నరకం వంగడాల ఉత్పత్తిపై ఆధునిక పద్ధతులను ఆయన రైతులకు వివరించారు. అనంతరం విత్తనోత్పత్తి సంస్థ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ప్రొడక్షన్ మేనేజర్ సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్ ఎం.ఆదినారాయణ రెడ్డి, వరంగల్ రీజియన్ మేనేజర్ రఘు, ఫీల్డ్ ఆఫీసర్ భిక్షపతి కార్యాలయ సిబ్బంది శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి సర్వే

ములుగు: గృహజ్యోతి పథకం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు దరఖాస్తు చేసుకున్న అర్హులను గుర్తించడానికి విద్యుత్ శాఖ తరుపున మంగళవారం నుంచి ఇంటింటా సర్వే చేపట్టారు. అధికారులు ఇంటికి వచ్చినప్పుడు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఫోన్ నెంబర్ అందించి సహకారించాలని అధికారులు కోరారు. ప్రజలు తప్పకుండా వివరాలు తెలుపాలని కమర్షియల్ జీఎం బీకాంసింగ్, డీఈ నాగేశ్వర్ రావు, ఏఓ దేవిదాస్, ఏడీ సలెందర్‌సింగ్, ఏఈలు సాయికృష్ణ, వేణుగోపాల్, సబ్ ఇంజనీర్ క్రాంతికుమార్, తదితరులు కోరారు.

క్లుప్తంగా

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


మొండయ్య(ఫైల్)

కాళేశ్వరం: అప్పుల బాధతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పలుగుల గ్రామానికి చెందిన పాలిశెట్టి మొండయ్య(46) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మొండయ్య మూడెకరాల్లో పత్తి, రెండు ఎకరాల్లో వరిపంటను సాగుచేశాడు. వర్షాకాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి అన్నారం(సరస్వతి) బ్యారేజీ బ్యాక్‌వాటర్‌తో గేట్లు ఎత్తిన సమయంలో పంటలోకి నీరు చేరి నష్టపోయాడు. దీంతో పంట పెట్టుబడికి తీసుకొచ్చిన అప్పులు పెరిగి మనస్తాపంతో మద్యానికి బానిసయ్యాడు. అప్పులకు వడ్డీలు కట్టలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో తరుచూ భార్యతో గొడవలు జరిగేవి. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గ్రామంతో పాటు చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం తెల్లవారుజామున తన పంటభూమి వద్ద ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి కనిపించాడు. గ్రామస్తులు చూసి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని మహదేవపూర్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అందజేశారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాజేశం తెలిపారు.

గోడను ఢీకొన్న కారు

- ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు


కల్యాణ్ (ఫైల్)

రఘునాథపల్లి: కారు అదుపు తప్పి గోడను ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం సోమవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్‌కు చెందిన చిర్ర సాయిలక్ష్మారెడ్డి తన స్నేహితులు మేడిపల్లి కల్యాణ్(22), వినయ్, వంశీరెడ్డితో కలిసి కారులో ఖిలాషాపూర్ నుంచి రఘునాథపల్లికి వెళ్తున్నారు. రాత్రి 11. 30 గంటల సమయంలో వెల్ది క్రాస్ సమీపంలోని మలుపు వద్ద కారు అదుపు తప్పి ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్ గోడను ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న జనగామ పట్టణంలోని బాణాపురానికి చెందిన మేడిపల్లి కల్యాణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. వినయ్, లక్ష్మారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి వెంటనే 108లో క్షతగాత్రులను జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం లక్ష్మారెడ్డిని హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. కల్యాణ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మంగళవారం కుటుంబీకులకు అప్పగించారు. ఈ ఘటనపై బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎదురుచూపులు ఫలించేనా..!

ఏడీఈలకు పదోన్నతులు లభించేనా? రిటైర్మెంట్‌కు దగ్గరగా అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు

- స్వరాష్ట్రంలోనూ దక్కని అవకాశాలు
- ఏపీ ఉద్యోగులు వెళ్లడంతో ఖాళీగా పోస్టులు
- ఆశల్లో తేలియాడుతున్న ఇంజనీర్లు



హన్మకొండ: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అధికారులు తమ రాష్ట్రానికి వెళ్లిపోవడంతో పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న టీఎస్‌ఎన్పీడీసీఎల్‌కు చెందిన అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లలో(ఏడీఈ) ఆశలు చిగురించాయి. ఏపీకి చెందిన 14 మందిని టీఎస్ ఎన్పీడీసీఎల్ రిలీవ్ చేసింది. దీంతో వీరి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్ర విభజనతో విద్యుత్ సంస్థలు విడిపోయాయి. ఈ క్రమంలో ఉద్యోగుల విభజన జరిగింది. నిధులు, నియామకాలు, నీళ్లే లక్ష్యంగా తెలంగాణ ఉద్యమం జరిగింది. అయితే రాష్ట్ర విభజనతో తమకు అవకాశాలు పెరుగుతాయని ఆశించిన విద్యుత్ ఉద్యోగ వర్గాలకు భంగపాటు తప్పలేదు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఉద్యోగులను కేటాయించడంతో వీరి అవకాశాలకు కత్తెర పడింది. ఆంధ్రప్రదేశ్ ఉద్యోగులను విధులకు దూరంగా ఉంచడంతో వారు కోర్టుకు వెళ్లారు. వీరితో పాటు తెలంగాణ ఉద్యోగులు కోర్టును ఆశ్రయించి ఆంధ్రప్రదేశ్ ఉద్యోగులను అక్కడికే పంపాలని కోరారు. సుప్రీంకోర్టు ధర్మాధికారి కమిటీ ఏర్పాటు చేసి ఉద్యోగుల విభజనపై పూర్తి హక్కులు కల్పించింది. ధర్మాధికారి కమిటీ విచారణ జరిపి ఉద్యోగుల కేటాయింపును పూర్తి చేసింది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ నుంచి 35 మంది ఏడీఈలను ఎన్పీడీసీఎల్‌కు కేటాయించారు. వచ్చిన వారు సీనియర్లు కావడంతో ఎన్పీడీసీఎల్ ఏడీఈలకు నిరాశ మిగిలింది.

20 ఏళ్లుగా ఎదురుచూపులు..

టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో పని చేస్తున్న ఏడీఈలు 20 ఏళ్లుగా డివిజనల్ ఇంజనీర్ పదోన్నతి కోసం ఎదురు చూస్తున్నారు. అయినా వారి ఆశలు నెరవేరడం లేదు. రిటైర్మెంట్ సమీపించినా పదోన్నతుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీనియారిటీలో ఉన్న ఏడీఈలకు పదోన్నతులు వస్తాయని ఆశిస్తే గతంలో పదోన్నతులు పొందిన వారికి రివర్షన్ కల్పించి యాజమాన్యం తీవ్ర మనోవేదనకు గురిచేసిందని వాపోయారు. డివిజన్ ఇంజనీర్లు పదోన్నతులు కల్పించడంలో టీఎస్ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం కాలయాపన చేస్తుండడంతో సీనియర్‌లైన అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లలో నిరాశనిస్పృహలు నెలకొన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి ఏడీఈలు రావడం.. వారు సీనియర్‌లు కావడంతో వారికి పదోన్నతులు కల్పించారు. దీంతో స్థానికత కలిగి ఉండి ఎన్నో ఏళ్లుగా ఎన్పీడీసీఎల్‌లో పని చేస్తున్న 12 మంది సీనియర్ అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

ఉద్యోగులు తమకు ఇష్టమైన రాష్ట్రాలను ఎంచుకోవచ్చు

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు తమకు ఇష్టమైన రాష్ట్రాలను ఎంచుకోవచ్చని కోర్టు సూచించింది. దీంతో టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో పని చేస్తున్న 14 మంది అధికారులు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో ఎస్సీ, ఎస్టీ లైన ఆరుగురు డివిజన్ ఇంజనీర్లు, ఆరుగురు అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్లు, ఒక సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, ఒక సూపరింటెండెంట్ ఇంజనీర్‌ను టీఎస్ ఎన్పీడీసీఎల్ రిలీవ్ చేసింది. ప్రస్తుతం ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో గతంలో రివర్షన్ పొందిన వారితో పాటు సీనియర్లలో మళ్లీ ఆశలు రేకెత్తాయి. ఆదిలాబాద్ ఎస్ఈగా పని చేస్తున్న జెడ్.ఉత్తమ్ డీఈగా రివర్షన్ పొందారు. డీఈలుగా పని చేస్తున్న ఉపేందర్, ఇ.వాసుదేవ్‌కు ఏడీఈలుగా రివర్షన్ ఇచ్చారు. సీజీఎం హోదాలో సీజీఆర్ఎఫ్‌లో అకౌంట్స్ మెంబర్‌గా పని చేస్తున్న చరణ్‌దాస్‌కు జనరల్ మేనేజర్‌గా రివర్షన్ ఇచ్చారు. వీరితో పాటు మరికొందరు సీనియర్లు పదోన్నతుల కోసం యాజమాన్యం నిర్ణయానికి ఆశగా ఎదురుచూస్తున్నారు. తెలంగాణ ఏర్పాటు క్రమంలో స్థానిక ఉద్యోగులకు నష్టం కలుగకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించుకోవచ్చని అవకాశం కల్పించిందని టీఎస్ ఎన్పీడీసీఎల్ ఉద్యోగవర్గాలు చెబుతున్నాయి. అయినా యాజమాన్యం స్థానికత కలిగిన ఏడీఈలకు పదోన్నతులు కల్పించకుండా వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలోనూ స్థానికులకు అవకాశాలు దక్కకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ స్టేట్ సదరన్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌లో సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి అక్కడి ఇంజనీర్‌లకు న్యాయం చేశారని ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు చెప్పారు. కాగా, తాము రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్నామని, ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి తమకు డివిజనల్ ఇంజనీర్‌గా రిటైర్డ్‌య్యే అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.

బీసీల హక్కుల సాధనకు ఉద్యమించాలి


మాట్లాడుతున్న భారత జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, చిత్రంలో గట్టు రాంచందర్‌రావు, వి.ప్రకాశ్, సారయ్య తదితరులు

- బీసీ గణన జరిగే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు జరపొద్దు
- భారత జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

హన్మకొండ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించినట్లుగానే బీసీల హక్కుల సాధనకు బీసీలంతా ఐక్యంగా ఉద్యమించాలని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. యునైటెడ్ పూలే ఫ్రంట్, భారత జాగృతి ఆధ్వర్యంలో బీసీ హక్కుల సాధనకు రౌండు టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో కవిత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ యునైటెడ్ పూలే ఫ్రంట్ బీసీల హక్కుల కోసం సాధనకు ఏర్పడిందన్నారు. వరంగల్ అంటే ఉద్యమాలకు పెట్టింది పేరని, రాణిరుద్రమదేవి, సర్దార్ సర్వాయి పాపన్న, చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో తెలంగాణ కోసం పోరాడమన్నారు. మరోసారి అదే స్ఫూర్తిని ప్రదర్శించాల్సిన అవసరం వచ్చిందన్నారు. రాష్ట్రంలో బీసీ జన గణన జరిపిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలన్నారు. ఆరు నెలల్లో బీసీ జనగణన పూర్తి చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రెండు నెలలవుతున్నా ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణకు పూనుకోలేదని విమర్శించారు. ఇచ్చిన హామీ మేరకు జనగణన కార్యక్రమాన్ని చేపట్టి ఆరు నెలల్లో పూర్తి చేసి స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా నామకరణం చేస్తామని చెప్పిన మాట నిలుపుకోవాలన్నారు. యునైటెడ్ పూలే ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు గట్టు రాంచందర్ రావు మాట్లాడుతూ ఏప్రిల్ 11లోపు అసెంబ్లీలో విగ్రహం పెట్టకపోతే ప్రభుత్వం అంతుచూస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ ఇందిరా పార్కులో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో ఈ నెల 12న నిర్వహించనున్న మహాధర్నాకు బీసీలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జలవనరుల మండలి మాజీ చైర్మన్ వి.ప్రకాశ్, కుడా మాజీ చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజు యాదవ్, భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్, ఆయా పార్టీలు, సంఘాల నాయకులు బక్క నాగరాజు, మోటె చిరంజీవి, గంగాపురం వేణుమాదవ్, వెంకట్రాజం, బయ్యా స్వామి, పి. రజనీకాంత్, టి.జనార్దన్ గౌడ్, మోహన్, రాధకృష్ణ, కొండయ్య, రాంబాబు పాల్గొన్నారు.

గృహజ్యోతికి ఆధార్, రేషన్‌కార్డు వివరాలివ్వండి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి


స్టేషన్‌ఘన్‌పూర్‌లో వినియోగదారులతో మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

రఘునాథపల్లి/ స్టేషన్‌ఘన్‌పూర్: గృహజ్యోతి పథకం అమలు కోసం వినియోగదారులు ఆధార్, రేషన్‌కార్డు వివరాలు మీటర్ రీడర్లకు ఇవ్వాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు అర్హులందరూ నెలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా వినియోగించుకోవచ్చన్నారు. మంగళవారం రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రాల్లో విద్యుత్ సిబ్బంది చేపట్టిన బిల్లింగ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గృహజ్యోతి అమలు కోసం తీసుకోవాల్సిన వివరాలు, ఇతర అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. వినియోగదారులతో మాట్లాడుతూ బిల్ రీడర్లకు రేషన్‌కార్డు, ఆధార్, ఫోన్ నంబర్లు అందజేసి విద్యుత్ మీటర్ సర్వీస్ నంబర్లకు అనుసంధానం చేసుకోవాలన్నారు. ఒకరికి ఒకే మీటర్‌కు అవకాశం ఉంటుందన్నారు. అద్దె ఇంట్లో ఉన్న వారు ఎలాంటి అపోహలకు గురికావొద్దని, వారు అద్దెకు ఉంటున్న మీటర్ నంబర్, వారి ధ్రువపత్రాలు అనుసంధానం చేసుకునే అవకాశం కల్పించామన్నారు. బకాయిలు పూర్తిగా చెల్లించి ప్రస్తుత రాయితీని పొందాలని సీఎండీ సూచించారు. తనిఖీల్లో ప్రాజెక్ట్ డైరెక్టర్ టి సుందర్‌లాల్, జనగామ ఎస్ఈ టి. వేణుమాధవ్, డీఈలు ఎంఎల్ ఎస్ రెడ్డి, హుస్సేన్‌నాయక్, ఏడీఈలు మనోహర్ రెడ్డి, వంశీకృష్ణ, ఏఈ రాహుల్, చంద్రమోహన్, ఈఆర్‌ఓ స్వర్ణలత, సబ్ ఇంజనీర్ వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

పింగిళి మహిళా డిగ్రీ కళాశాల సెమిస్టర్ల ఫలితాల విడుదల

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాలల (అటానమస్) డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సుల మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్, రెండో సంవత్సరం మూడో సెమిస్టర్, మూడో సంవత్సరం ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను మంగళవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి, కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి విడుదల చేశారు. డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలో 523మందికిగాను 300 మంది విద్యార్థినులు 57.3శాతం ఉత్తీర్ణత సాధించారు. మూడో సెమిస్టర్‌పరీక్షల్లో 458మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా అందులో 277మంది 60.4శాతం ఉత్తీర్ణత సాధించారు. ఐదో సెమిస్టర్ పరీక్షలకు 419 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా అందులో 330మంది విద్యార్థినులు 78.70శాతం ఉత్తీర్ణత సాధించారు. కళాశాల పరీక్షల నియంత్రణాధికారి రామకృష్ణారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు రేణుక, శిరీష, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి

- జిల్లా సంక్షేమ అధికారి మధురిమ


మాట్లాడుతున్న మధురిమ

హన్మకొండ : అవగాహన కల్పించడం ద్వారా బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయొచ్చని హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారి కె.మధురిమ అన్నారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని ఆసుంత భవన్‌లో బాల్య వివాహాల నిర్మూలన, బాలల అక్రమ రవాణా, బాలలపై లైంగిక హింస, వేధింపులు, నివారణ అంశంపై హనుమకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక లేమి కారణాలతో తల్లిదండ్రులు తమ పిల్లలకు పెళ్లిళ్లు చేసి వారి భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారన్నారు. ఇలాంటి చట్టవిరుద్ధ కార్యక్రమాలకు పాల్పడొద్దన్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, బాలల పరిరక్షణ కమిటీలు పర్యవేక్షణ చేస్తూ సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. పిల్లలకు విద్యను ఆయుధంగా అందించి ఉజ్వల భవిష్యత్తు అందించాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అన్నమనేని అనిల్ చందర్ రావు మాట్లాడుతూ పిల్లలు సామాజిక మాధ్యమాల ప్రభావాలకు లోనుకాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ పి.సంతోష్ కుమార్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్.ప్రవీణ్ కుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ ఎస్.భాస్కర్, సోషల్ వర్కర్ మెరుగు శ్రీనివాసులు, జిల్లా మహిళా సాధికార కేంద్రం లిట్రసీ కోఆర్డినేటర్ స్వర్ణలత, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రోగ్రాం అధికారి ఎర్ర శ్రీకాంత్, అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబిస్తుంది

- కేయూ వీసీ తాటికొండ రమేష్


మాట్లాడుతున్న వీసీ రమేష్

కేయూ క్యాంపస్: సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబిస్తుందని కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేష్ అన్నారు. కేయూ తెలుగు విభాగం, పీవీ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆచార్య బన్న ఐలయ్య అధ్యక్షతన యూనివర్సిటీలోని సెనేట్‌హాల్‌లో మంగళవారం కేయూ మాజీ పాలకమండలి సభ్యుడు మువ్వాశ్రీనివాస్‌రావు రచించిన 'అనితరుడు' కవితాంత రంగ విశ్లేషణల పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా నిర్వహించిన సభలో వీసీ మాట్లాడారు. విద్య సబ్జెక్ట్, వృత్తికి సాహిత్యానికి సంబంధం లేదన్నారు. వ్యవస్థను మార్చే శక్తి మహిళకు ఉంటుందన్నారు.విద్యార్థులు ర్యాంకులతోపాటు సమాజాన్ని సరైన కోణంలో అర్థం చేసుకోవాలన్నారు. అప్పుడే విద్యార్థి ఆత్మహత్యలవంటి సామాజిక రుగ్మతల నుంచి బయట పడుతామన్నారు. సాహిత్యం ఆకళింపు చేసుకుంటే విమర్శ సులభమవుతుందన్నారు. మువ్వా శ్రీనివాస్‌రావు సాహిత్యంలో ఎన్నోకోణాలు ఉన్నాయన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్యనవీన్‌మాట్లాడుతూ మూసధోరణులు కాకుండా కవిత్వంలో నూతనత్వం, వైవిధ్యం ఉండాలన్నారు. సాహిత్యకారుల ఆలోచన పరిధి విస్తృతమైందన్నారు. పుస్తక సమీక్ష చేసిన డాక్టర్‌వాసిరెడ్డి కృష్ణారావు మాట్లాడుతూ కవి ఎప్పుడూ ఆలోచనలలో ముందు ఉంటాడన్నారు. తెలుగు సాహిత్యం గొప్పదన్నారు. సాహిత్యరచనలకు వయసు అడ్డు కాదని అభ్యుదయ కవులు గుర్తుంచుకోవాలన్నారు. మరో గ్రంథ సమీక్షకుడు డాక్టర్ భండార్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ కవికి ఊహాశక్తి ఉండాలన్నారు. కార్యక్రమంలో కవి, రచయితలు గిరిజామనోహర్‌బాబు, వీఆర్ విద్యార్థి, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, బిల్లమహేందర్, కె వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే బాధిత రైతుల కన్నెర్ర

- పరిహారం అందించాలని ధర్నా


ధర్నా చేస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే బాధిత రైతులు

నెల్లికుదురు : గ్రీన్ ఫీల్డ్ హైవేకు సేకరించిన భూములకు పరిహారం అందించకుండానే హద్దులు నాటడం దౌర్జన్యమని, దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని గ్రీన్ ఫీల్డ్ హైవే భూ బాధిత రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామ పరిధిలోని నెల్లికుదురు- మహబూబాబాద్ ప్రధాన రహదారిపై గ్రీన్ ఫీల్డ్ హైవే భూముల వద్ద చిన్నముప్పారం, ఆలేరు, నర్సింహులగూడెం గ్రామాలకు చెందిన రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవేకు ఎంత విస్తీర్ణం మేరకు భూములు కోల్పోతున్నారో లెక్కలు చెప్పకుండా అధికారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించి అన్యాయం చేస్తున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హైవేలో భూములు కోల్పోని రైతులకు పరిహారం అందుతుందని, భూములు కోల్పోయి నష్టపోయిన రైతులకు మాత్రం అందడంలేదన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవేలో మూడు గ్రామాల నుంచి కోట్ల విలువైన సుమారు 500 ఎకరాల భూములు కోల్పోతున్న రైతులకు పక్క జిల్లాలో ఇచ్చిన మాదిరి మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందించాలన్నారు. కోల్పోతున్న భూముల వివరాలు బాధిత రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాపై సమాచారం అందుకున్న ఎస్సై క్రాంతికిరణ్ ఘటనాస్థలికి చేరుకుని సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు కారుపోతుల సుమన్, గోపాల్‌రెడ్డి, అప్పిరెడ్డి, రమేష్, రవీందర్, భిక్షపతి, శ్రీను, చందు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట-అయోధ్య ప్రత్యేక రైలు ప్రారంభం


రైలును ప్రారంభిస్తున్న బీజేపీ నేతలు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో మంగళవారం కాజీపేట-అయోధ్య ప్రత్యేక రైలును బీజేపీ ఎమ్మెల్యేలు ప్రారంభించారు. రైల్వేశాఖ ప్రవేశపెట్టిన కాజీపేట-అయోధ్య ప్రత్యేక రైలుకు ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 1,346 మంది రిజర్వేషన్ చేసుకోగా అందులో 1,226 మంది కాజీపేట జంక్షన్‌కు చేరుకున్నారు. మిగతా120 మంది రాలేదు. కాజీపేట జంక్షన్ ఎదుట రైల్వే అధికారులు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ అడిషనల్ రైల్వే మేనేజర్ గోపాల్, సీనియర్ డివిజన్ ముఖ్యవాణిజ్య మేనేజర్ బస్వరాజు, ఆర్‌పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ డేబస్మిత బెనర్జీ, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ శైలేష్‌కుమార్, అదనపు కమర్షియల్ మేనేజర్ ఐఎస్‌ఆర్.మూర్తి, కాజీపేట ఆర్‌పీఎఫ్ సీఐ సంజీవరావు, జీఆర్‌పీ సీఐ రామ్మూర్తితో పాటు రైల్వే వివిధ విభాగాల అధికారుల ఆధ్వర్యంలో ప్రయాణికులకు స్వాగతం పలికి రిజర్వేషన్ చేసుకున్న వారికి ట్యాగ్‌తో కూడిన ఐడీ కార్డులు జారీ చేసి రైలు వద్దకు పంపించారు. బీజేపీ కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, ఎం. ధర్మారావు, విజయరామారావు, కొండేటి శ్రీధర్, మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు, పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావుపద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రేమేందర్‌రెడ్డి ప్రత్యేక రైలును ప్రారంభించారు. సాయంత్రం 6. 20 గంటలకు రైలు అయోధ్యకు బయలుదేరింది.

నలుగురికి అనుమతి నిరాకరణ

సమయానికి చేరుకున్నా తమను తీసుకెళ్లేవారు టికెట్ ఇవ్వకపోవడంతో అయోధ్య రైలులో తమను అనుమతించలేదని హనుమకొండకు చెందిన సత్యనారాయణ, వెంకట్రామిరెడ్డి, వాసంతి, ప్రభావతి.. విలేకరుల ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. ఆశతో అయోధ్యకు వెళ్లాలని వచ్చిన తమను పట్టించుకోకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు.

శాస్త్రీయ సంగీతంపై అవగాహన కల్పించాలి

- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య


కీర్తనలు ఆలపిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ కల్చరల్ : భావితరాలకు శాస్త్రీయ సంగీత విద్య ఆవశ్యత తెలియజేసి, అభ్యసించేలా అవగాహన కల్పించాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మంగళవారం ఉదయం పోతనవిజ్ఞాన పీఠం ఆడిటోరియంలో విద్యారణ్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో సద్గురు శ్రీత్యాగరాజస్వామి 177వ ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ నాఢ్గాడ సుధీర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కలెక్టర్ ప్రావీణ్య, ఆత్మీయ అతిథిగా ఆగమసామ్రాట్ భద్రకాళి శేషు పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం వారు విద్యార్థులతో కలిసి శ్రీత్యాగరాజస్వామి పంచరత్న కీర్తనల గోష్ఠిలో పాల్గొని కీర్తనలను ఆలపించారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ గతంలో ఏ సంగీత కార్యక్రమాల్లో కూడా ఐఏఎస్ స్థాయి అధికారి సంగీత గోష్ఠిలో పాల్గొనలేదని, వరంగల్ కలెక్టర్ పాల్గొని కీర్తనలు ఆలపించడం ఇదే మొదటిసారి అని ప్రశంసించారు. అలాగే, పండిత్ శ్రీవిష్ణు నారాయణ్ భాత్ఖండే, పండిత్ శ్రీ విష్ణు దిగంబర్ పలుస్కర్ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకుని మధ్యాహ్నం 12గంటలకు ప్రముఖ సంగీత విద్వాంసుడు నాసా గోపినాథ్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులతో సంగీత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ గుమ్మడి జనార్దన్, సిబ్బంది అనుముల యోష, ఏడిద భీమశంకర్, సింగారపు భాస్కర్, ప్రొఫెసర్ తిరుపతయ్య, హరి విజయశ్రీ, లాయక్ అహ్మద్, కుంట రాజు, ఉమ్మడి లక్ష్మణాచారి, చాతరాజు నవ్యజ, గడ్డం శంకర్, ప్రవల్లిక, తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులతోనే మహిళ ఆత్మహత్య

- ఏడుగురి అరెస్టు.. రిమాండ్ తరలింపు
- వివరాలు వెల్లడించిన వరంగల్ ఏసీపీ కిషన్

ఖిలా వరంగల్ : అదనపు కట్నం రూ.26వేల కోసం వేధింపులకు గురిచేయగా మనస్తాపం చెందిన ఓ మహిళ.. తన 7నెలల కుమారుడితో కలిసి పర్వతగిరి మండలం అన్నారం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనలో పోలీసులు మంగళవారం ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వరంగల్ ఏసీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏసీపీ బోనాల కిషన్ కేసు వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ ఎస్.కె అఫ్జల్‌కు ఒక కుమారుడు, కుమార్తె తస్లీమ్(23) ఉన్నారు. 19 నెలల క్రితం తస్లీమ్‌ను వరంగల్ శంభునిపేటకు చెందిన ఎండి. మహమూద్ రెండో కుమారుడు తన్వీర్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఈ సమయంలో రూ.1.50 లక్షల నగదు. 3 తులాల బంగారం, 26 తులాల వెండి, బైక్ కోసం షాదీముబారక్ పథకంలో భాగంగా ప్రభుత్వం అందజేసిన రూ.లక్ష నగదు తన్వీర్‌కు అందజేశారు. అయితే బైక్ కొనుగోలుకు రూ. లక్ష సరిపోవని, ఇంకా రూ.26వేలు ఇవ్వాలని, అదన కట్నం తీసుకు రావాలని వివాహం జరిగిన ప్పటి నుంచి తస్లీమ్‌ను వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో కుటుంబీకులు, భర్త వేధింపుల భరించలేక మనోవేదనకు గురైన తస్లీమ్ తన కుమారుడు తైమూర్‌ను తీసుకుని ఈనెల 1వ తేదీన ఇంటి నుంచి బయలుదేరి పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ దర్గాకు చేరుకుంది. కుమారుడితో కలిసి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. చెరువు నుంచి మృతదేహాలను వెలికితీసి మృతురాలి తండ్రి అఫ్జల్‌కు అప్పగించినట్లు తెలిపారు. ఈ ఘటనపై శంభునిపేటకు చెందిన మృతురాలి పెద్దమ్మ ఫాతిమా, మృతురాలి తండ్రి అఫ్జల్ ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త తన్వీర్, అత్త అఫ్జల్‌బీ, మామ మహిమూద్, ఆడబిడ్డ తస్లీమ్, బావ ఫారూఖ్, తోటికోడలు షాజహ, ఆడబిడ్డ భర్త జాఫర్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు ఏసీపీ తెలిపారు. మిల్స్‌కాలనీ సీఐ సురేష్ గౌడ్, ఎస్సైలు వెంకన్న, రాజు, మున్నూర్ ఉల్లా పాల్గొన్నారు.

రెండు లారీల మధ్య చిక్కుకుని డ్రైవర్ మృతి

- మృతుడు నల్లగొండ జిల్లావాసి

రఘునాథపల్లి: రెండు లారీల మధ్య చిక్కుకుని ఓ డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని కోమళ్ల టోల్‌ప్లాజా వద్ద మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం సవుల్లతండాకు చెందిన ఇస్లావత్ రవి (32) లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం కాళేశ్వరం నుంచి హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తున్నాడు. ఈ క్రమంలో టోల్‌ప్లాజా వద్ద కాసేపు సేదదీరేందుకు లారీ ఆపాడు. ఏమరుపాటులో లారీని హ్యాండ్ బ్రేక్ వేయకుండా పార్కింగ్ చేసి టీ తాగడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ఆ లారీ కదులుతూ ముందున్న మరోలారీ వద్దకు వెళ్తుండగా గుర్తించాడు. వేగంగా వెళ్లి వాహనాన్ని నిలిపి వేసే క్రమంలో రెండు లారీల మధ్య చిక్కుకుని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.